క్లుప్తంగా

వీఆర్ఏల నిరసన

కార్వేటినగరం: వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే జిల్లా కలెక్టరేట్ల వద్ద దీక్షలు చేపడతామని ఆ సంఘం మండల అధ్యక్షుడు లోకనాథం తెలిపారు. ఆయన శుక్రవారం వీఆర్ఏలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు, అధికారులకు మధ్య వారధిగా ఉంటూ సేవలు అందిస్తున్న వీఆర్ఏల సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించాలన్నారు. నామినీగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులైన వారికి వీఆర్వోలుగా, అటెండర్లుగా, వాచ్‌మెన్‌గా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వెదురుకుప్పం: మండలంలోని ఇనాంకొత్తూరు గ్రామ పంచాయతీలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇందులో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి హాజరై ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేయడంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

కార్వేటినగరం: మండలంలోని సూరయ్యపాళ్యం ఎస్టీకాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ సుద్దగుంట గ్రామానికి బదిలీ అయిన ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్‌ను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ సంఘం నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్ సూరయ్యపాళ్యంలో పిల్లల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఏపీటీఎఫ్ నాయకుడు గోవిందయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా కిరణ్‌కుమార్ అందించిన సేవలను సూరయ్యపాళ్యం ఎస్టీకాలనీ వాసులు మరిచిపోరని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు హేమచంద్రారెడ్డి, ఆటుకారు చంద్రశేఖర్, నాగేంద్రవర్మ, రజింత్‌కుమార్, పురుషోత్తం, యూటీఎఫ్ నాయకులు వెంకటేష్, కానిక్‌రాజ్, యువరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



కొబ్బరి మొక్కలు నాటేందుకు తీసిన గుంతను పరిశీలిస్తున్న ప్రేమ్‌రాజ్‌కుమార్

పాలసముద్రం: మండలంలో ఉపాధిహామీ పథకంలో మంజూరైన కొబ్బరి, పండ్ల తోటల పెంపకంపై రైతులు శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం నరసింహపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ కింద ప్రభుత్వం కొబ్బరి, వివిధ పండ్ల తోటల పెంపకానికి అవకాశం కల్పిస్తోందన్నారు. మొక్కలకు నీరు పోయడానికి నగదు ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుం కొబ్బరి, పండ్లతోటలు మంజూరైన వారు త్వరలో పనులు పూర్తి చేయాలని సూచించారు.

పవన్ పతనం ఖాయం



మాట్లాడుతున్న కాలప్ప

శ్రీరంగరాజపురం: ప్యాకేజీ తీసుకుని నోటికి వచ్చినట్టు మాట్లాడే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పతనం ఖాయమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలప్ప తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాసిచ్చిన స్క్రిప్ట్ ప్రకారం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఉంటారని ఆరోపించారు. రాజకీయ పరిజ్ఞానం లేకుండా ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ సేవలు అందిస్తున్న వలంటీర్లపై అనుచిత వాఖ్యలు చేయడం నీతిమాలిన చర్య అని మండిపడ్డారు. గతంలో జన్మభూమి కమిటీల సభ్యులు ప్రజలను వేధింపులకు గురిచేసినప్పుడు పవన్‌కళ్యాణ్ కళ్లు మూసుకుని ఉన్నారా అని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని, లేకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. శ్రీను, గిరిబాబు, రమేష్, సుబ్బయ్య పాల్గొన్నారు.

రేపు శాస్త్రీయ సంగీత శిక్షణ

చిత్తూరు రూరల్: నగరంలోని రెవెన్యూ భవనంలో ఆదివారం ప్రజాహిత సేవ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా శాస్త్రీయ సంగీత శిక్షణ నిర్వహించనున్నట్లు అధ్యక్షులు రాజరత్నం రెడ్డి తెలిపారు. ఆసక్తిగల పిల్లలు 9908274927కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

నాడు అధ్వానం.. నేడు అపురూపం

- విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనపైనే రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మంత్రి ఆర్‌కే రోజా చొరవతో రెండు దశాబ్దాల కల సాకారం
- రూ.86 లక్షల వ్యయంతో జంబాడ-పాతర్కాడు గ్రామాలకు తారురోడ్డు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రెండు గ్రామాల ప్రజలు



నాడు: జంబాడ-పాతర్కాడు రోడ్డు



నేడు: జంబాడ-పాతర్కాడు రోడ్డు

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. గతంలో కనీసం నడిచి వెళ్లడానికి వీలు లేని విధంగా రోడ్లు ఉండేవి. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక రోడ్లు గుంతలమయంగా దర్శనమిచ్చేవి. అయితే 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే మారుమూల గ్రామాలకు వెళ్లే రోడ్లను సైతం అభివృద్ధి చేసి రవాణా సౌకర్యాన్ని సులభతరం చేసింది. నగరి నియోజకవర్గంలోని విజయపురం మండలం జంబాడ-పాతర్కాడు రోడ్డు ఎన్నో ఏళ్ల తరువాత మంత్రి రోజా చొరవతో తారురోడ్డుగా మారింది.

విజయపురం (నగరి): సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీ పడకుండా సమకూరుస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చాలావరకు రోడ్లు లేక ఎన్నో ఏళ్లుగా జనం ఇబ్బంది పడుతున్నారు. అయితే రాష్ట్రంలో ప్రతి మారుమూల గ్రామానికి కూడా రోడ్డు సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోంది. ఇప్పటికే చాలావరకు ప్రభుత్వం రోడ్లను అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే.

ఎన్నో ఏళ్లుగా గుంతలరోడ్డే..

నగరి నియోజకవర్గంలోని విజయపురం మండలం జంబాడ-పాతార్కాడు రోడ్డు గత కొన్నేళ్లుగా గుంతలమయంగా ఉండేది. అయితే రాష్ట్రప్రభుత్వం లక్ష్యంలో భాగంగా స్థానిక ప్రజల కోరిక మేరకు మంత్రి ఆర్‌కే రోజా జంబాడ- పాతర్కాడు గ్రామాల ప్రజలను నెరవేర్చాలన్న సంకల్పంతో ఇటీవల రోడ్డు వేయించారు. ఇన్నేళ్లకు తమ గ్రామాల రోడ్డు మహర్దశ పట్టిందని రెండు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో పేరున్న నాయకులు గతంలో ఇక్కడి నుంచి ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహించినా కూడా ఏనాడు గ్రామాలకు రోడ్లు వేయాలన్న ఆలోచన రాలేదు. కనీసం తమతో ఓట్లు వేయించుకున్న తరువాత మళ్లీ తమ గురించి పట్టించుకోలేదని, ఇప్పుడు మంత్రి రోజా చొరవ తీసుకుని రోడ్డు వేయించారని హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తరువాత జంబాడ రోడ్డుకు మోక్షం కలిగింది. దీంతో ఇన్నేళ్లు రోడ్డు లేక ఇబ్బంది పడిన ప్రజలు ఇప్పుడు రోడ్డు వేయడంతో రవాణా ఇబ్బందులు తీరాయి.

ఇన్నాళ్లకు మోక్షం..

జంబాడ-పాతర్కాడు రోడ్డు ఏఎన్‌కండ్రిగ రోడ్డుకు సుమారు మూడు కిలోమీటర్లు ఉంటుంది. ఇది కనకమ్మసత్రం వెళ్లడానికి ప్రధానమైన రోడ్డు. నగరి నుంచి పన్నూరు, విజయపురం, జంబాడ, పాతర్కాడు మీదుగా కనకమ్మసత్రం రోజుకు సుమారు 10 ఆర్టీసీ సర్వీసులు నడుస్తాయి. అయితే రెండు దశాబ్దాలుగా గులకరాళ్లతో దర్శనమిచ్చిన రోడ్డుకు ఇప్పుడు మంత్రి ఆర్‌కే రోజా చొరవతో మోక్షం కలిగింది. ప్రస్తుతం రూ.86 లక్షల వ్యయంతో జంబాడ-పాతర్కాడుపై తారురోడ్డు వేశారు. గతంలో అక్కడక్కడ గుంతలు, గులకరాళ్లు ఉండడంతో రవాణా చేసేటప్పుడు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇటీవల తారురోడ్డు వేయడంతో ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు దశాబ్దాలు ఇబ్బంది పడ్డాం..



రెండు దశాబ్దాలుగా జంబాడ-పాతర్కాడు రోడ్డు గురించి ఎవరూ పట్టించుకోలేదు. అక్కడక్కడ గుంతలు, గులకరాళ్ల తేలిపోవడంతో ద్విచక్ర వాహనంలో వెళ్లాలంటే భయంగా ఉండేది. వర్షాకాలంలో అయితే చాలా ఇబ్బందులు పడ్డాం. ఇన్నేళ్ల తరువాత మంత్రి రోజా సహకారంతో తారురోడ్డు వేయడం చాలా సంతోషంగా ఉంది.

–దేవ, పాతర్కాడు, విజయపురం

మంత్రి రోజాకు రుణపడి ఉన్నాం..



ఎంతోమంది నాయకులు వచ్చారు.. వెళ్లారు.. కానీ జంబాడ-పాతర్కాడు రోడ్డు గురించి పట్టించుకోలేదు. మంత్రి ఆర్‌కే రోజా చొరతో మా రోడ్డుకు మోక్షం వచ్చింది. ఆమె మేలు ఎప్పుడూ మరచిపోలేం. ప్రతిఒక్కరూ మంత్రి రోజాకు రుణపడి ఉన్నాం.

–భాస్కర్‌రాజు, జంబాడ సర్పంచ్, విజయపురం

వర్షాకాలంలో అయితే ఇబ్బంది పడ్డాం..



రోడ్డుపై అక్కడక్కడ గుంతలు ఉండేవి. వర్షాలు పడి గుంతలో నీరు నిలవడంతో రోడ్డులో వెళ్లడానికి ఇబ్బంది పడ్డాం. ఒక్కోసారి కింద పడి చాలామంది గాయపడ్డారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు చాలాసార్లు చెప్పాం. మంత్రి చొరవతోనే మా రోడ్డుకు మోక్షం వచ్చింది.

–నాగభూషణ్ యాదవ్, పాతర్కాడు

ముఖ్యమంత్రికి శ్రీవారి జ్ఞాపిక



ముఖ్యమంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న హరి, పక్కన మంత్రి రోజా

పుత్తూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఏ.హరి శ్రీవారి జ్ఞాపికను అందజేశారు. వెంకటగిరి పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రిని శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజాతో కలిసి హరి స్వాగతం పలికారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



టైలరింగ్ శిక్షణ ప్రారంభిస్తున్న శ్రీహరి

పుత్తూరు రూరల్: చేతి వృత్తుల్లో శిక్షణతోపాటు రుణాలు పొందుతున్న మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రాస్ జన్ శిక్షణ్ సంస్థాన్ అధికారి శ్రీహరి పేర్కొన్నారు. స్థానిక రాష్ట్రీయ సేవా సమితి (రాస్) కార్యాలయంలో శుక్రవారం టైలరింగ్ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో శిక్షణ పొందుతున్న మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం పలు రకాల ప్రోత్సాహాలతో పాటు రుణాలను అందిస్తోందని, తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడానికి కృషి చేయాలని చెప్పారు. 40 మందికి 84 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, బాలమ్మ, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బూత్‌లెవల్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ కళావతి

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): బూత్‌లెవల్ కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని పెనుమూరు తహసీల్దార్ కళావతి తెలిపారు. ఆమె శుక్రవారం అఖిలపక్ష పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆయా బూత్ లెవల్‌వారీగా అన్ని పార్టీలకు సంబంధించిన అభ్యర్థులతో పాటు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయా బూత్‌లెవల్ వీఆర్ఏల సహకారంతో ఓటర్ల ముసాయిదా జాబితా సర్వేను చేపడతారని తెలిపారు. బోగస్ ఓట్లు, జంబ్లింగ్, మృతిచెందిన వారి ఓట్లు, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారిని పరిశీలించి జాబితాను సిద్ధం చేయాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మహాసముద్రం సురేష్‌రెడ్డి, గోవిందరెడ్డి, దొరస్వామియాదవ్, కమలాకర్‌రెడ్డి, నీలాపండరీనాథ్, దాము, టీడీపీ నాయకుడు రుద్రయ్య నాయుడు, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థితికి చేర్చేది విద్య

కార్వేటినగరం: ప్రతి ఒక్కరినీ ఉన్నత స్థితికి చేర్చే మహోన్నతమైన ఆయుధం విద్య మాత్రమేనని ఎస్ఎస్ఏ ఏఈ నాగభూషణం తెలిపారు. ఆయన శుక్రవారం ఎంఈవో ఎం.విజయకుమార్‌తో కలిసి డీఎం పురం ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తాను చిన్నతనంలో కడు పేదరికాన్ని అనుభవించానని తెలిపారు. పట్టెడు అన్నం కోసం జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్) కళాశాల ఆవరణలో యాచించానని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి నేడు ఈ స్థాయికి చేరానని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి పోటీతత్వంతో విద్యనభ్యసించినప్పుడే సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని సూచించారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కాదని, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యకు పెద్ద పీట వేశారని వివరించారు. ఇలాంటి సీఎంలు ఉన్నతం వరకు విద్యార్థులు ఎంతవరకైనా చదువుకోవచ్చని చెప్పారు. పాఠశాల హెచ్ఎం కేశవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



వినాయక స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న బాలాజీ

కార్వేటినగరం: టీటీడీ ఆధ్వర్యంలో దళితవాడల్లో ఆలయాల నిర్మాణాలు చేపట్టడం బృహత్తర కార్యక్రమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. మండలంలోని మిట్టదళితవాడలో శుక్రవారం వినాయకస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సనాతన ధర్మంతోపాటు భక్తి, ఆధ్యాత్మిక భావాలను పెంపొందించడంతోపాటు సంప్రదాయాలను కాపాడుకోవడానికి ఆలయాలు ఎంతో దోహద పడతాయన్నారు. అందులో భాగంగానే ఆలయాల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా మతమార్పిడీలు జరిగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు టీటీడీ ఆధ్వర్యంలో హిందూ ఆలయాలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చందురాజు, ధనరాజ్, కుమార్, రాజ పాల్గొన్నారు.

రాగిపంట సాగుపై అవగాహన



రాగి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పాలసముద్రం: మండలంలోని రైతన్నలు రాగి పంట సాగుపై శ్రద్ధ పెట్టాలని మండల ప్రత్యేక అధికారి మహబూబ్‌బాషా తెలిపారు. ఆయన శుక్రవారం నరసింహపురం రైతు భరోసా కేంద్రంలో ఏవో ఢిల్లీ ప్రసాద్‌తో కలిసి రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా నిర్ణయించిందన్నారు. ఆర్‌బీకే సిబ్బంది తమ పరిధిలోని గ్రామాలకు వెళ్లి రైతులతో మాట్లాడి రాగి పంట సాగుచేసేలా ప్రోత్సహించాలని సూచించారు. రాగి పంటకు కిలో రూ.38లుగా ప్రభుత్వం గిట్టుబాటు ధర నిర్ణయించిందని వివరించారు. తక్కువ ఖర్చుతో దిగుబడి బాగా వచ్చి, ఆదాయం ఎక్కువగా ఉంటుందన్నారు. అనంతరం నరసింహపురం సమీపంలో రైతు సాగు చేసిన రాగి పంటను పరిశీలించారు.

దహన క్రియల షెడ్డు పనులు ప్రారంభం



క్రిమేషన్ షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న అధికారులు

నగరి: పట్టణ పరిధిలోని శ్మశానవాటికలో దహనక్రియల షెడ్డు నిర్మాణానికి మంత్రి ఆర్‌కే రోజా నిధులు మంజూరు చేయించడంతో పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణ పరిధి కుశస్థలి నదిని ఆనుకొని ఉన్న శ్మశాన వాటికలో వసతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ దహనానికి సరిపడా కొయ్యలు, ఇతర దహన సామగ్రి తెప్పించుకోవడంలో స్థానికులకు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్య దశాబ్దాల తరబడి ఉన్న ఎవరూ ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపలేదు. ప్రస్తుత మంత్రి ఆర్కేరోజా ఈ సమస్య పరిష్కారానికి సంకల్పించారు. శ్మశాన వాటికలో దహన క్రియల షెడ్డు నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. తొలివిడతగా రూ.35 లక్షలు విడుదల చేయించి షెడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో క్రిమేషన్ షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, డీఈ నరేష్ మాట్లాడుతూ అత్యాధునిక పద్ధతిలో ఎల్‌పీజీ గ్యాస్ ద్వారా క్రిమేషన్ పూర్తిచేసే షెడ్డు పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ పనులు త్వరితగతిన పూర్తిచేసి, స్థానికులకు అందుబాటులో తీసుకొస్తామని వివరించారు.

జగనన్న సురక్షతో ప్రజల వద్దకే పాలన



పుత్తూరు: సర్టిఫికెట్లు అందుకున్న వారితో రామ్‌ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

పుత్తూరు రూరల్: ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను అడిగి పరిష్కరించేదే జగనన్న సురక్ష పథకమని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు మండలం తిరుమలకుప్పం సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. రామ్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ దేశం మొత్తం మీద ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి సమస్య అడిగి తెలుసుకొని పరిష్కరిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని తెలిపారు. గతంలో ఒక్క సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే దుస్థితి ఉండేదని, నేడు సురక్ష పథకంద్వారా పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. సీఎం అడుగుజాడల్లో నడుస్తూ రాత్రింబవళ్లు ప్రజల కోసం శ్రమిస్తున్న మంత్రి ఆర్కే రోజాను మరోసారి గెలిపించాలని కోరారు. అనంతరం సురక్ష లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇందిర, ఎంపీపీ మునివేలు, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, సర్పంచ్ సరస, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు రక్ష జగనన్న సురక్ష

వెదురుకుప్పం: జగనన్న సురక్ష పేదలకు రక్ష అని జెడ్పీటీసీ సుకుమార్ అన్నారు. మండలంలోని పచ్చికాపల్లంలో శుక్రవారం జగనన్న సర్షక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఉచితంగా 11 అంశాలకు సంబంధించి సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఏకారణం చేత ప్రభుత్వ పథకాలు అందలేదో తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకరరావు, డీటీ కోమల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి, సర్పంచ్ కుమారి పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు

విజయపురం (నగరి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలన్నీ ఇంటికే అందిస్తున్నామని మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. క్షురికాపురం సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రేషన్‌కార్డు, కుల, ఆదాయం సర్టిఫికెట్లు అందించారు.

వలంటీర్లతోనే విజయవంతం

కార్వేటినగరం: సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలతోనే క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయని, జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం కావడానికి కూడా వలంటీర్లే కారణమని నియోజకవర్గ ప్రత్యేక అధికారి త్రిశూల్ తెలిపారు. మండలంలోని కొల్లాగుంట, కృష్ణాపురం సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచులు దివ్య, భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరిందన్నారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వంద శాతం ప్రజలకు అందడానికి వలంటీర్ల వ్యవస్థ ముఖ్య భూమిక పోషిస్తోందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తూ సేవలు అందిస్తున్న వలంటీర్లపై పవన్‌కళ్యాణ్, చంద్రబాబు, లోకేష్, టీడీపీ అనుకూల పచ్చ పత్రికలు విషప్రచారం చేయడం దారుణమన్నారు. చంద్రబాబు ముఠా ఎన్ని కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్‌రాజు, ఎంపీడీవో మోహన్‌మురళీ, డీటీ లక్ష్మీపతి, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ మునికృష్ణ, ధనశేఖర్‌వర్మ, గాంధీ పాల్గొన్నారు.







వెదురుకుప్పం: ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు, విజయపురం: సర్టిఫికెట్లు అందిస్తున్న మంత్రి సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి, కార్వేటినగరం: ధ్రువీకరణ పత్రాలు అందకున్న లబ్ధిదారులు